సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం ၊ 11 ၊ జనవరి ၊ 2025



'కల' సాకారమయ్యేనా?

పర్యాటక కేంద్రంగా మార్చాలనుకున్న పేరంటాల చెరువు నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. 10లో



అప్రమత్తంగా ఉండండి..

సంక్రాంతి పండుగకు పిల్లలతో కలిసి ఊరికి వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. 10లో



వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశంలో మేఘావృతంగా మారుతుంది. ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం కుంకుమ పూజ, గణపతిహోమం తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈఓ రజనీకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పతకాల పంట


- రాణించిన అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి



పతకాలు సాధించిన కృష్ణవేణి

బూర్గంపాడు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సారపాకలోని తాళ్ల గొమ్మూరుకు చెందిన అంగన్‌వాడీ టీచర్ కణితి కృష్ణవేణి ప్రతిభ చూపింది. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నాలుగు పతకాలు సాధించింది. 200 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం, లాంగ్ జంప్‌లో రెండో స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త బింగి రాజు, కోచ్‌ల సహకారం, ప్రోత్సాహంతోనే అథ్లెటిక్స్‌లో రాణించినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఫిబ్రవరిలో కేరళలో జరగనున్న జాతీయ అథ్లెటిక్స్‌లో కూడా రాణిస్తానని తెలిపారు. ఆమెను సారపాకకు చెందిన పలువురు ప్రముఖులు, అధికారులు అభినందించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



వివరాలు వెల్లడిస్తున్న మేనేజర్ నర్సింహారావు

గుండాల: చిల్లగింజలు, ముష్టిగింజలు, ఇతర అటవీ సంపదను గిరిజన సహకార సంస్థకే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని గిరిజన సహకార సంస్థ ఇల్లెందు డివిజన్ మేనేజర్ ఎస్.నరసింహారావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళారులు ఎక్కువ ధర చెల్లిస్తామంటూ తూకాల్లో మోసానికి పాల్పడుతున్నారని అన్నారు. కొందరు దళారులను గుండాల మండలం మోదులగూడెం వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించామని తెలిపారు. గిరిజన సహకార సంస్థ కిలో ముష్టిగింజలకు రూ.75 చెల్లిస్తోందని పేర్కొన్నారు. మేనేజర్ పగడయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం శుక్రవారం పలువురు అధికారులను బదిలీ చేసింది. ఈఅండ్‌ఎం విభాగంలో 9 మంది, మైనింగ్ విభాగంలో ఐదుగురిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో ఇద్దరు ఏజీఎంలు, నలుగురు ఎస్‌ఈలు, ఇద్దరు డీవైఎస్‌ఈలు, ఐదుగురు ఈఈలు, ఒక అండర్ మేనేజర్ ఉన్నారు. వీరందరూ కంపెనీ నిర్దేశించిన సమయంలో బదిలీ స్థానాల్లో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా దేవీప్రసన్న

కొత్తగూడెంరూరల్: జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా తిరిగి తోట దేవీ ప్రసన్న నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం టీపీసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసన్న గతంలో కూడా అధ్యక్షురాలిగా పనిచేశారు. రెండోసారి అవకాశం కల్పించినందుకు టీపీసీసీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వైకుంఠ రామా..



ఉదయం ఐదు గంటలకు తెరుచుకుంటున్న భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయ ఉత్తర ద్వారం





వేదపండితుల మంత్రోచ్చరణలు.. ధూప దీపాల నడుమ.. జయజయ గంటలు మోగుతుండగా.. రామయ్య స్వామి గరుడ వాహనంపై, సీతమ్మవారు గజవాహనంపై, లక్ష్మణస్వామి హనుమత్ వాహనంపై వేంచేశారు. దివ్యతేజంతో వెలుగొందుతున్న స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వగా.. వేకువజాము నుంచే ఎదురుచూస్తున్న భక్తులు కనులారా వీక్షించి తన్మయత్వం పొందారు. విద్యుత్ దీపాలతో మిరిమిట్లు గొల్పుతున్న రామాలయ ప్రాంగణం.. పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం.. భక్తుల జయజయ ధ్వానాలు, శ్రీరామనామస్మరణ వెరసి భద్రగిరి భూలోక వైకుంఠంగా మారింది. ముక్కోటిని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారు జామున శ్రీసీతారామ చంద్రస్వామివారిని దర్శించుకుని భక్తులు పరవశించారు.

– భద్రాచలం

- కనుల పండువగా ఉత్తర ద్వార దర్శనం
- స్వామివారిని వీక్షించి పరవశించిన భక్తులు
- శ్రీరామనామస్మరణతో మార్మోగిన భద్రగిరి
- భద్రాచలంలో అట్టహాసంగా వైకుంఠ ఏకాదశి

ధూప, దీప, నైవేద్యాల నడుమ..

సరిగ్గా ఉదయం 5 గంటలకు జేగంటలు మోగుతుండగా వేదఘోష నడుమ వైకుంఠ ద్వారం తలుపులు తెరుచుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్తర ద్వారంలో ధూప, దీప, నైవేద్యాల నడుమ శ్రీ సీతారామ లక్ష్మణ సమేతంగా రామయ్య స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గంటసేపు ఉత్తర ద్వారంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నివేదన, ఫల నైవేద్యం, మంత్రపుష్పం సమర్పించారు. ఆ తర్వాత వేదపారాయణం జరిపారు.



వేడుకల్లో మంత్రి తుమ్మల, ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్, భక్తులు

రుగ్వేద, యజుర్వేద, సామ, అధర్వణ వేదాలను పండింతులు పఠించారు. అనంతరం 108 ఒత్తులతో స్వామివారికి హారతి ఇచ్చారు. శరణాగతి, దండకం అనంతరం ద్వార దర్శనం ప్రాశస్త్యాన్ని దేవస్థానం అర్చకులు వివరించారు.

వైభవంగా తిరువీధి సేవ

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన అనంతరం శ్రీసీతారామలక్ష్మణ సమేతుడైన స్వామివారు తిరువీధి సేవకు బయలుదేరి వెళ్లారు. గరుడ వాహనంపై స్వామి వారు, గజ వాహనంపై సీతమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి వారు రాజవీధి మీదుగా తాతగుడి వరకు తిరువీధి సేవకు వెళ్లగా, వారికి ముందు చలవ చప్రంలపై ఆండాళ్, ఆళ్వార్ దేవతలు ఊరేగారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామివారి తిరువీధి సేవ వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు వెంట నడువగా గోవిందరాజ ఆలయం వరకు వెళ్లిన స్వామివారు ప్రత్యేక పూజలు అందుకుని, తిరిగి రాజ వీధి మీదుగా గ్రామ పదర్శన చేసి ఆలయానికి చేరుకున్నారు.

స్వామివారిసేవలో ప్రముఖులు

ముక్కోటి వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం, ఇల్లెందు, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, ఆలయ ఈఓ రమాదేవి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీ దర్శనం ముక్కోటి పుణ్యఫలం



స్వామివారి ఉత్సవమూర్తులు



భద్రాచలంలో ఉత్తర ద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తులు

తెల్లవారుజామున సంప్రదాయబద్ధంగా..

భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన ఉత్తర ద్వార దర్శనం నేత్రపర్వంగా సాగింది. తొలుత శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవలు, విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారు ఆలయ మర్యాదలతో వెండి గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలోకి రాగా, దేవస్థాన హరిదాసులు శ్రీరామ కీర్తనలను పాడారు. ఆ తర్వాత స్థానాచార్యులు కేఈ స్థలశాయి వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యాన్ని వివరించారు. రామయ్య, సీత, లక్ష్మణ వాహనాల ప్రత్యేకతను తెలిపారు. వైకుంఠంలో వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారిని ముక్కోటి దేవతలు దర్శించుకుంటారని, అందుకే వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యఫలం వస్తుందని చెప్పారు. వైకుంఠం నుంచి సరాసరి భద్రగిరిపై ప్రత్యక్షమైన స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోయి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.



లైటేసినా దారి కానరాట్లే..!

- ఉదయం దట్టంగా కమ్మేస్తున్న పొగమంచు
- రహదారి కనిపించక వాహనదారుల పాట్లు
- చలితో గజగజ వణుకుతున్న ప్రజలు
- జిల్లాలో కొద్దిరోజులుగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

చుంచుపల్లి: జిల్లాలో చలి పంజా విసురుతోంది. పొగ మంచు కమ్మేస్తోంది. వారం రోజులుగా తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు చలి తీవ్రతకు వణికిపోతున్నారు. పొగ మంచు, చల్లటి గాలుల వల్ల పొద్దున్నే ఇంటి నుంచి బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచే శీతల గాలుల తాకిడి మొదలవుతోంది. ఇక రాత్రి వేళల్లో చలి తీవ్ర రూపం దాల్చుతోంది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 3 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదవుతున్నాయి. జిల్లాలో మొన్నటి వరకు 16,17 డిగ్రీలు నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 14 డిగ్రీలకు పడిపోయాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27, 28 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఏజెన్సీ, గోదావరి పరీవాహక ప్రాంతాలు భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, పినపాక, ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల తదితర ప్రాంతాల్లో జిల్లా కేంద్రం కొత్తగూడెం కంటే 2 డిగ్రీల వరకు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రతకు వృద్ధులు, పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. ఉబ్బసం తదితర వ్యాధులు ఉన్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



పొగ మంచులో లైట్లు వేసుకుని వస్తున్న వాహనం

కమ్మేస్తున్న మంచు..

వారం, పది రోజులుగా గ్రామాలు, పట్టణాల్లో మంచు దుప్పటి కమ్మేస్తోంది. రహదారులను మంచు కమ్మేసి ఊటీని తలపిస్తున్నాయి. గుట్టల ప్రాంతాల్లో మంచు ప్రభావం మరింత ఎక్కువగా ఉంటోంది. వాహనదారులు, రైతులు ఉదయాన్నే బయటకు రాలేకపోతున్నారు. ఫుట్‌పాత్‌లపై అమ్మకాలు సాగించే చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. పొగ మంచు కారణంగా విజయవాడ, ఖమ్మం రహదారులపై సమీపంలోకి వచ్చేవరకు భారీ వాహనాలు, బస్సులు, కార్లు కనిపించడం లేదు. దీంతో లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలువురు ఉన్ని దుస్తులు ధరించి బయటకు వెళ్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో చలికోట్లు, రగ్గులు,స్వెటర్ల విక్రయాలు కూడా ఊపందుకున్నాయి. మరో నాలుగైదు రోజులు చలి తీవ్రత మరింతగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో జనం ఆందోళన చెందుతున్నారు. చలి నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆస్తమా, గుండె సంబంధ వ్యాధులున్నవారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఉదయం చలిలో ఎక్కువగా వాకింగ్ చేయకూడదని చెబుతున్నారు.

ఒక్కసారిగా చలి పెరిగింది



నాలుగు రోజులుగా చలి పెరిగింది. సాయంత్రం 5 గంటలకే చల్లటి గాలులు వీస్తున్నాయి. రాత్రి 7 గంటల నుంచి చలి తీవ్రత పెరుగుతోంది. చలి అధికంగా ఉండటంతో షాపును తొందరగానే మూసేయాల్సి వస్తోంది. ఉదయం 9 గంటలైనా చలి ప్రభావం తగ్గటం లేదు.

– భల్‌దేవ్, కొత్తగూడెం

జాగ్రత్తలు పాటించాలి



చలి నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటికే పరిమితమవ్వాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వృద్ధులు, చిన్న పిల్లలు అప్రమత్తంగా ఉండాలి. చలితో న్యూమోనియా, చర్మ వ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ ఎ.పుష్పలత, జనరల్ ఫిజీషియన్

వడివడిగా అడుగులు

- వేగంగా విమానాశ్రయ ఏర్పాటు ప్రక్రియ
- ఈ నెల 20న స్థల పరిశీలనకు కేంద్ర బృందం రాక
- ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు మంత్రి తుమ్మల ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు తథ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల 20న కొత్తగూడెం, సుజాతనగర్, చుంచుపల్లి మండలాల్లో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందాలు పర్యటిస్తాయని ఆయన వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గతంలో సూచించిన ప్రాంతంలో భూములు అనుకూలంగా లేవని తేలింది. దీంతో కొత్తగూడెం, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించారు. దీంతో అక్కడ సర్వే నిర్వహించాలంటూ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి స్పందిస్తూ ఎయిర్ పోర్టు నిర్మాణానికి సాధ్యాసాధ్యాల పరిశీలనకు ప్రత్యేక బృందం రావాల్సి ఉంటుందని, అందుకు అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని లిఖిత పూర్వకంగా బదులిచ్చారు. ఈ అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఇటీవల ఆ నిధులు మంజూరయ్యాయి.

20న ఎయిర్ పోర్టు అథారిటీ బృందం పర్యటన

కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఈ నెల 20న రానున్న బృందానికి అవసరమైన ఏర్పాట్లు చూడాలని కలెక్టర్‌తోపాటు రెవెన్యూ యంత్రాంగాన్ని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఇప్పటికే కొత్తగూడెం, పాల్వంచలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా రూపు రేఖలు మారుతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వాణిజ్య, పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధికి విమానాశ్రయం ఎంతో దోహదం చేస్తుందన్నారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలానికి పర్యాటకులు సింగరేణి, భారజల, ఐటీసీ పరిశ్రమలకు దేశ విదేశాల నుంచి ఉన్నతాధికారులు రాకపోకలు సాగించేందుకు దోహదపడుతుందన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు మంత్రి తుమ్మల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎయిర్ పోర్టు ఏర్పాటులో వీరి సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసిన రాష్ట్ర మంత్రి తుమ్మల (ఫైల్)

సింగరేణిలో 'ఆక్టోపస్' పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ప్రత్యేక భద్రతా బృందం(ఆక్టోపస్) సందర్శించింది. ప్రధాన కార్యాలయ ఆవరణ, పలు విభాగాలను తనిఖీ చేసినట్లు తెలిసింది. అనుకోని ప్రమాదాలు సంభవించిన క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించి, బ్లూ ప్రింట్‌లను నమోదు చేసుకున్నట్లు సమాచారం. కార్యాలయ సమాచారశాఖను కూడా పరిశీలించినట్లు విశ్వసనీయ సమాచారం. తొలిసారిగా ఆక్టోపస్ బృందం సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడటంతో అధికారులు, ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు.



ఉత్తర ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లేందుకు వేచి ఉన్న భక్తజనం

విద్యుత్ కాంతుల వెలుగులో భద్రాచలంలోని ఉత్తర ద్వారం





గరుడ వాహనంపై రాముల వారు

రమణీయం.. 'ఉత్తర' దర్శనం

■ పోటెత్తిన భక్తులు ■ రాములోరిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీమహావిష్ణువు వైకుంఠం నుంచి ఉత్తరద్వారం గుండా దర్శనమివ్వనున్నాడనే విశ్వాసంతో వైష్ణవాలయాల్లో ఉత్తరద్వార దర్శనాలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా భద్రాచలంలో ఉత్తర ద్వారం గుండా శ్రీసీతారామచంద్రస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అర్ధరాత్రి నుంచే తరలివచ్చిన భక్తులు వేచి ఉండగా.. శుక్రవారం తెల్లవారుజామునే అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ ఉత్తర ద్వారాన్ని తెరిచారు. దీంతో రామనామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. కాగా, శ్రీసీతారామచంద్రస్వామిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లుతో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



రామయ్యను దర్శించుకుంటున్న ఎంపీ బలరాంనాయక్



హాజరైన ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య

విద్యుత్ సిబ్బందికి అభినందనలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన హంసవాహన తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలకు విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా విజయవంతంగా పర్యవేక్షించిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్ఈ మహేందర్, భద్రాచలం డీఈ జీవన్ కుమార్, ఏడీ వేణు, ఏఈ రాజారావు శుక్రవారం అభినందించారు.



సిబ్బందిని అభినందిస్తున్న డీఈ జీవన్, ఏడీఈ వేణు

వీఐపీ సెక్టార్‌లో దర్శనానికి పాట్లు

భద్రాచలం: ఉత్తర ద్వార దర్శనంలో ఎప్పటిలానే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనధికార పాసులతో వచ్చిన వారితో వీవీఐపీ, వీఐపీ సెక్టార్లు నిండిపోయాయి. తీరా టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు వచ్చేసరికి సెక్టార్లు రద్దీగా దర్శనమిచ్చాయి. ఫలితంగా సెక్టార్లలో నిలబడే స్వామి దర్శన క్రతువు వీక్షించాల్సి వచ్చింది. మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటుగా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒకానొక దశలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ వాకీటాకీల ద్వారా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు.



స్వామి మూలవరుల దర్శనానికి క్యూ లైన్‌లో బారులు దీరిన భక్తులు

క్లుప్తంగా

రామయ్య చెంతన సాధారణ పౌరులమే...



క్యూ లైన్‌లో భద్రాద్రి, వికారాబాద్ కలెక్టర్లు పాటిల్, ప్రతీక్, ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ఖద్దరు చొక్కా ధరిస్తే చాలు ఆలయాల్లో ప్రొటోకాల్ పేరిట హడావుడి చేస్తున్న వారు ఉన్న ఈ కాలంలో జిల్లా ఉన్నతాధికారులు అయినప్పటికీ సాధారణ భక్తుల్లా క్యూ లైన్‌లో వెళ్లి మరీ రామయ్యను దర్శించుకుని ఆదర్శంగా నిలిచారు. భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం జరగగా.. ఇక్కడి నుంచి భక్తులంతా మూలవరుల దర్శనానికి క్యూలో నిల్చున్నారు. ఈక్రమాన భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్ కలెక్టర్లు జితేష్ వి.పాటిల్, ప్రతీక్‌జైన్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సైతం ప్రొటోకాల్ దర్శనం కాకుండా మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న ఉత్తర ద్వారం మెట్ల మీదుగా క్యూలైన్ల ద్వారా వెళ్లి మూలమూర్తులను దర్శించుకోవడం విశేషం.

కిన్నెరసానిలో సందడి

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి శుక్రవారం భారీగా ప్రజలు తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను, ప్రకృతి అందాలను తిలకించారు. 325 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.11,080 ఆదాయం ఆర్జించగా.. 250 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.8,800 ఆదాయం లభించింది.

మేకలు చోరీ

ఇల్లెందు: పట్టణంలోని ఎల్‌బీఎస్‌నగర్‌కు చెందిన పార్వతీపాసీ ఇంటి ఆవరణలో కట్టివేసి ఉన్న మూడు మేకలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ నెల 5వ తేదీ రాత్రి ఇంటి ఆవరణలో ఉన్న మేకల్లోంచి మూడు మేకలను అపహరించారు. సుమారు రూ.30 వేల విలువ కలిగిన మేకలను చోరీ చేశారని శుక్రవారం పార్వతీపాసీ ఫిర్యాదు చేయగా సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీకొట్టిన కారు

పాల్వంచరూరల్: రోడ్డు పక్కన ఉన్న ఆటోను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో తోగ్గూడెం క్రాస్‌రోడ్డులో శుక్రవారం భద్రాచలం నుంచి పాల్వంచవైపు వస్తున్న పీసీఆర్ ఎస్ఐ రామారావు కారు రోడ్డు పక్కన ఉన్న ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోడ్రైవర్ ధర్మపురి రామారావు, అడపాల లక్ష్మీదేవమ్మ, బానోత్ లాల్, శ్రావణపు పద్మ, బి.సుకుమార్‌కు గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ఆటోడ్రైవర్‌ను ఖమ్మంకు, మిగిలిన క్షతగాత్రులను భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ ఏరియా స్పత్రులకు తరలించారు. ఎస్ఐ సురేష్‌ను వివరణ కోరగా పీసీఆర్ ఎస్ఐ రామారావు కారు నడుపుతూ ఆటోను ఢీకొట్టాడని, బాధితులు ఫిర్యాదు చేయక పోవడంతో కేసు నమోదు చేయలేదన్నారు. కాగా, క్షతగాత్రులను మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శ్రీనివాసరావు పరామర్శించారు.

గంజాయి ఆయిల్ పట్టివేత

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న గంజాయి ఆయిల్ (హషీష్)ను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో ఎస్ఐ సుమన్ తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో గంజాయి ఆయిల్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరిని ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బలిమెల మండలం తార్లకోటకు చెందిన మాలేశ్‌రావ్ పాడల్, నీలకంటెరువా గ్రామానికి చెందిన ద్వారీ శాంతికిరణ్‌గా గుర్తించారు. వీరు మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయి ఆయిల్‌ను తరలిస్తున్నారని, గంజాయి ఆయిల్ విలువ రూ.4 లక్షలు ఉంటుందని, వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

'కల' సాకారమయ్యేనా?

- కలెక్టర్ ఆశించినట్లు జరిగేనా?
- గ్రావెల్ రవాణాతో ప్రశ్నార్థకంగా పేరంటాల చెరువు భవిష్యత్
- పర్యాటక ప్రతిపాదనలకు ఆదిలోనే మంగళం



వాహనంలో గ్రావెల్ లోడింగ్ చేస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: చుట్టూ కొండలు, పక్షుల కిలకిల రావాలు, మత్స్యకారుల చేపల వేట, సహజ సిద్ధంగా పెరిగిన చెట్లు ప్రకృతి ప్రేమికులకు విడిది. ప్రకృతి తీర్చిదిద్దిన అందాలతోపాటు టూరిస్ట్ స్పాట్‌గా దర్శనమిచ్చే చెరువు సుమారు 170 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. సాంబాయిగూడెం, రామానుజవరం, దమ్మక్కపేట గ్రామాలతో పాటు పినపాక మండలాల్లోని కొన్ని గ్రామాల్లో మొత్తం 1,100 ఎకరాలకు ఈ చెరువే ఆయకట్టు. ఇదీ పేరంటాల చెరువు స్థితి. పినపాక నియోజకవర్గంలో మండల కేంద్రంగా ఉన్న మణుగూరు అభివృద్ధి దిశగా, పారిశ్రామిక ప్రాంతంగా మారింది. అడవులు, కొండలు, చెంతనే గోదావరి, ఏడాది పొడవునా నిండుకుండలా దర్శనమిచ్చే చెరువులతో కలగలిపి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ 'కల' అక్రమార్కులు ఇష్టానుసారంగా గ్రావెల్ రవాణాతో పేరంటాల చెరువు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సాంబాయిగూడెం పేరంటాల చెరువు, రేగులగండి, వెన్నెల జలపాతాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లతో మణుగూరు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి ఇటీవల క్షేత్రస్థాయిలో పేరంటాల చెరువును సందర్శించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అడ్డగోలుగా యథేచ్ఛగా సాగుతున్న గ్రావెల్ రవాణాతో చెరువు భవిష్యత్తు, అనుబంధంగా ఉన్న ఇసుకమట్టు చెరువుతో పాటు వాటికి అనుకుని ఉన్న సాంబాయిగూడెం గ్రామం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్న తీరు కలెక్టర్ సార్ ఆశలపై నీళ్ల చల్లుతున్న చందంగా తయారవుతున్నాయి.

ప్రమాద ఘంటికలు

పేరంటాల చెరువుకు ఒక వైపు గుట్టగా ఉన్న గ్రావెల్‌ను కొందరు అక్రమార్కులు రూ.6 కోట్ల విలువైన అగ్రిమెంట్ ప్రాతిపదికన లక్షల క్యూబిక్ మీటర్లు అడ్డూ అదుపు లేకుండా తోలుతూ అధికారులు అడ్డగించినా పనులు ఆగకుండా జెన్‌కో భూముల్లో యాష్ పాండ్‌కి సమీపంలో వందలాది కుప్పలు పోసినట్లు తెలుస్తోంది. గతంలో గ్రామకంఠంగా ఉన్న భూముల్లో కేవలం 4–5 మీటర్ల నడకదారి మాత్రమే ఉంచి తోలకాలు చేయడంతో వానాకాలం వచ్చే వరదలతో నిల్వ పెరిగి చెరువు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బీటీపీఎస్ కోసం సాంబాయిగూడెంలో కొంత భూమిని జెన్‌కో సేకరించింది. మిగిలిన గ్రామకంఠం భూమిని సైతం హద్దులు చెరిపి అక్రమార్కులు అడ్డగోలుగా తోలేయడంతో సాంబాయిగూడెం పేరంటాల చెరువు ఆయకట్టు రైతులు పంట భవిష్యత్, లబ్ధిపొందుతున్న మత్స్యకారుల భవిష్యత్ అంధకారంలో పడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, చెరువు చెంతనే తోలకాలు చేపట్టిన గ్రావెల్‌ను పూడ్చాలని కోరుతున్నారు.

అటవీశాఖ పరిధిలో లేదు



పేరంటాల చెరువు సమీపంలో ఉన్న గుట్టలు అటవీశాఖ పరిధిలో లేవు. గుట్టపై గ్రావెల్ రవాణా కోసం అడ్డగోలుగా నరుకుతున్న చెట్లపై వివిధ రకాల ఫిర్యాదులు రావడంతో రికార్డులు పరిశీలించాం. అక్కడ ఫారెస్ట్ భూమిలో ఎలాంటి తవ్వకాలు జరగలేదు. ఆ భూమి ఫారెస్ట్ భూమి కాదు.

– ఉపేంద్ర, ఫారెస్ట్ రేంజర్

రెవెన్యూ పరిధిలో లేదు



పేరంటాల చెరువు వద్ద గ్రావెల్ రవాణా చేస్తున్న గుట్టలు రెవెన్యూ భూమిగా రికార్డుల్లో చూపడం లేదు. ఆ గుట్టలు ఏశాఖ పరిధిలోకి వస్తాయో తెలియడం లేదు. ఆ భూమిని పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించాం. సర్వే అనంతరం నివేదికను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– రాఘవరెడ్డి, తహసీల్దార్

ఏఎస్పీ బంగ్లాలో రాపత్తు సేవ

భద్రాచలంటౌన్: ఏఎస్పీ బంగ్లాలో శుక్రవారం రాత్రి శ్రీసీతారామచంద్ర స్వామివారికి రాపత్తు సేవ ఘనంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా రామయ్యకు రాపత్తు సేవలు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ. వైకుంఠ ఏకాదశి రోజు నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయి. స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ప్రసాదాలను అందజేశారు. వేడుకల్లో భద్రాచలం న్యాయమూర్తి శివనాయక్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, డీఎస్పీలు రవీందర్ రెడ్డి, సతీశ్, సీఐ సంజీవ్‌రావ్, ఎస్ఐలు విజయలక్ష్మి, మధుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాపత్తు సేవలో పాల్గొన్న ఏఎస్పీ, అధికారులు

అలరించిన 'ఏరు' సాంస్కృతిక కార్యక్రమాలు

భద్రాచలంటౌన్: భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరి తీరంలో నిర్వహిస్తున్న ఏరు (రివర్ ఫెస్టివల్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థినులచే శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్‌కుమార్, వీరస్వామి, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, ఆర్డీఓ దామోదరావు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

మూడు రోజులూ వైద్యశిబిరాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం, పర్ణశాలలో మూడు రోజుల పాటు ప్రథమ చికిత్స కేంద్రాలు నిర్వహించామని భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చైతన్య శుక్రవారం తెలిపారు. మొత్తం 31 మంది డాక్టర్లు, 74 పారామెడికల్ సిబ్బంది, 12 మంది క్యాంప్ అరేంజ్‌మెంట్ సూపర్‌వైజర్లు, నలుగురు ప్రోగ్రాం ఆఫీసర్లు విధులు నిర్వర్తించారని, మొత్తం 6,200 మందికి వైద్య సేవలు అందించారని వివరించారు.



బ్రిడ్జిసెంటర్ శిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ చైతన్య

అప్రమత్తంగా ఉండండి..

- దూర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: సంక్రాంతి పండుగకు పిల్లలతో కలిసి ఊరికి వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పండుగ సందర్భంగా దూర ప్రాంతాలకు వెళ్లే ఇదే అదునుగా భావించి దొంగలు చోరీలకు పాల్పడుతారని, ఊరికి వెళ్లే వారు చిరునామాను పోలీసులకు అందించాలని తెలిపారు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తామని, చోరీల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఎస్పీ సూచనలు

- సంక్రాంతికి ఊరికి వెళ్లాలనుకునేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇంటి చిరునామాతో పాటు సెల్ నంబర్‌ను కూడా అందించాలి.
- ఇంటి పక్కన, చుట్టు పక్కల వాళ్లను గమనించమని చెప్పాలి.
- కాలనీలో కమిటీలు వేసుకుని వాచ్‌మెన్‌లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- సోషల్ మీడియాలో బయటకు వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయాలి.
- కాలనీవాసులు స్వచ్ఛందంగా కమిటీలు ఏర్పాటు చేసుకుని, పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై డయల్ – 100కు సమాచారం ఇవ్వాలి.

క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్లు ఏర్పాటు చేయాలి..

జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. పోలీసుల పనితీరు పోలీసులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుశాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్లను జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయాలని సూచించారు.

సారు.. సెల్‌ఫోన్‌లో బిజీ..

విద్యార్థులు ఆట, పాటల్లో నిమగ్నం

చండ్రుగొండ: తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు నిషిద్ధమని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఉన్నతాధికారులు అనేక మార్లు హెచ్చరిస్తున్నా.. చాలామందికి అవేమీ పట్టినట్లు లేదు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 155 మంది విద్యార్థులున్నారు. 8 మంది ఉపాధ్యాయు లున్నారు. శుక్రవారం కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే హాజరయ్యారు. అందులో ప్రసాద్ అనే ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాల్సింది పోయి సెల్‌ఫోన్‌లో బిజీగా ఉన్నారు. దీంతో విద్యార్థుల్లో ఆటపాటల్లో మునిగారు. ఇదిలా ఉండగా మిగిలిన ఉపాధ్యాయుల సంగతేంటని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌ను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు వచ్చాయి. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమ పాఠశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఫోర్జరీ చేసిన వ్యక్తిపై కేసు

మణుగూరుటౌన్: ఫోర్జరీ చేసి డబ్బులు కాజేయడమే కాకుండా దాడికి పాల్పడిన వ్యక్తిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సోమ సతీశ్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన రచేపల్లి బాలయ్య బ్యాంకు ఖాతాలో రూ.11 లక్షలు ఉండగా.. ఆయన అన్న కుమారుడు కల్యాణ్‌కుమార్.. తన బంధువులు కొర్లపాటి అలేఖ్య, రాజ్‌కుమార్ సాయంతో, ఫోర్జరీ సంతకంతో డ్రాచేశాడు. దీనిపై బాలయ్య కుమార్తె జగ్గిలి రత్నమ్మ ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు. దీంతో వారు రత్నమ్మపై దాడి చేశారని, కల్యాణ్‌కుమార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులతో దుర్భాషలాడాడని, మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించాడని, సీఐ సతీశ్ చెప్పారు.

ఏడేళ్ల చిన్నారిపై లైంగికదాడి


కొత్తగూడెంరూరల్: చాక్లెట్ ఇస్తానని నమ్మించి, అభం శుభం తెలియని ఓ చిన్నారిపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన ఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాల మెస్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ప్రశాంతినగర్ విశ్వరూప థియేటర్ వెనక ఉన్న ఓ ప్రైవేట్ మెస్‌లో వంట మనిషిగా పనిచేస్తున్న వ్యక్తి కుటుంబం అక్కడే నివాసముంటోంది. అక్కడే ఉన్న చిన్నారిపై కూరగాయలు తరిగే పనిచేస్తున్న బూడిదగడ్డకు చెందిన వేముల రవి కన్నేశాడు. చాక్లెట్ ఇస్తానని నమ్మించి, గదిలోకి తీసుకెళ్లి, లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారి కేకలు వేయటంతో రవి అక్కడే దొరికడంతో దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమణారెడ్డి రవిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. చిన్నారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ దేశ్యాతండాకు చెందిన గుగులోత్ నంద (56) విద్యుదాఘాతంతో గురువారం రాత్రి మృతి చెందాడు. మాణిక్యారం గ్రామ పంచాయతీ మర్రిగూడెం గ్రామ శివారులోని చింతలవాగు వద్ద బోర్‌మోటార్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని కొమరారం ఏఎస్ఐ నాగరాజు శుక్రవారం తెలిపారు.

జ్వరంతో యువకుడు...

చర్ల: మండలంలోని గొమ్ముగూడెంనకు చెందిన ఓ యువకుడు జ్వరంతో మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గొమ్ముగూడెంనకు చెందిన సంకపాక ప్రభాకర్ కుమారుడు వెంకటేశ్ (20) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. శుక్రవారం జ్వరం తీవ్రత పెరగడంతో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.



వెంకటేశ్ (ఫైల్)

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

కొత్తగూడెంటౌన్: తండ్రి అనారోగ్యానికి గురి కావడంతో మనస్తాపం చెందిన కుమారుడు ఇర్రి అవినాష్ (30) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామవరం టూటౌన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. రామవరం వనందాస్ గడ్డబస్తీలో నివాసం ఉంటున్న ఇర్రి ఏసురత్నం మూడేళ్లుగా అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. పెద్ద కుమారుడు అవినాష్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అవినాష్ నేతాజీ పాఠశాల సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి ఇర్రి ప్రమీల, తమ్ముడు సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.



అవినాష్ (ఫైల్)